
"కామాక్షమ్మోదినా! అయ్యవారు ఎంత మంచివారూ... మా అమ్మాయి తెలుగులో పూర్ కదా అని ట్యూషన్ పెట్టించాంకదా! నెలయింది. జీతమివ్వకపోతే మర్యాదగా వుండదని మా పెద్దపిల్లతోనే పంపించానమ్మా. 'ఆ... ఎందుకు? వద్దులే... వుంచండి' అంటూ తిప్పి పంపాడు మారాజు..." వింతగా చెప్పింది రాజేశ్వరమ్మ పక్కింటి కామాక్షమ్మతో.

"ఆయనగారి భార్య మాత్రం మిర్రి మిర్రిగా చూసిందట మా అమ్మాయివేపు" మళ్లీ తనే అన్నది రాజేశ్వరమ్మ.

"మొగుడు డబ్బులు తీసుకోలేదని అయుంటుందిలే ఆ చూపు. ఉద్యోగం వెలగబెడుతోందిగా. మళ్లీ మొగుడి సంపాదనెందుకు? ఓ సిల్కా... పీచా... ఏమన్నానా... ఏం ఖర్చులుంటాయ్‌గనక" మూతి మూడు వంకర్లు తిప్పుతూ అన్నది కామాక్షమ్మ. జీతం, గీతం




అన్నీ మొగుణ్ణి తన్ని లాక్కునే రకం ఈ కామాక్షమ్మ. ఊళ్లో వాళ్లకో రూలు, తనొక్కతికే ప్రత్యేక రూలు అనుకునే తత్వం ఈవిడది.

తెలుగు టీచర్‌గా ఉద్యోగం కాక, ట్యూషన్లు చెబుతాడు త్రిపురాంతకశర్మగారు.

"ఆయనకేమండీ! దేముడు-వంచిన తల ఎత్తడు. ఆడవాళ్లను చూస్తే మరీనూ..." నోరు గంపలాగా తెరచి, మెచ్చుకోలుగా అన్నాడు ఆ వీథిలోనే వుండే చిన్నారావు-మాష్టారి గురించి.

"అవునండీ! మొన్నటికి మొన్న మా ఆవిడ యాభై రూపాయలివ్వబోతే, 'వద్దు ... వద్దంటూ' ఇరవై రూపాయలే తీసుకున్నాడు. పాపం! ఎంత మంచివారో మాష్టరుగారు..." లొట్టలేస్తూ చెప్పాడు లోకేశ్వరరావు.

"ఆయనకేమండీ! వాళ్లావిడ కూడా సంపాదిస్తోంది. మనమిచ్చే ట్యూషన్ రాళ్ళ (డబ్బులు) ఒక లెక్కా..." అని పొగుడుతూ తన ఐదుగురి పిల్లలకూ ఉచితంగా ట్యూషన్ చెప్పించుకునే ఏర్పాటు చేసుకున్న శరభయ్యగారి ఉవాచ.

"మొన్నటికి మొన్న మా ఇల్లు కడుతున్న మేస్త్రీ భార్యకు అడగ్గానే రెండొందలిచ్చాట్ట, వాళ్ళు మళ్లీ ఇస్తారో లేదోగానీ వేరేవాళ్ల పని వాళ్లన్నా ఎంత అభిమానమో! మాష్టారికి" శరభయ్య భార్య వెంకటరత్నమ్మ అన్నది.

ఇలా మాష్టారుండే బస్తీలోనూ, ఆ బస్తీ వాళ్లకు తెల్సిన వాళ్ళూ, త్రిపురాంతకశర్మ బంధువులూ-అందరూ ఆయన ఉదార స్వభావాన్ని ప్రశంసించేవారే.

***

"ఓ రెండు రూపాయలివ్వండి బస్‌కు" బృహతి అభ్యర్థన.

"మొన్నేకదే ఇచ్చింది. ఏం చేస్తున్నావే ముండా డబ్బులన్నీ" భర్తగారి దబాయింపు అనాగరిక పద్ధతిలో.

జీతమంతా భర్త చేతిలో పోసి, ఆఫీసుకెళ్లేటప్పుడు రోజూ అతనిచ్చే చిల్లరకోసం బృహతి పడే అవస్థ వర్ణనాతీతం.

"ఇహ నుండీ నేనివ్వను. మన ఎదురింటి మనోహరరావు మీ ఆఫీసే కదా! నీకు రోజూ బస్‌కూ, కాఫీకీ కావాల్సిన చిల్లర డబ్బులతనివద్ద తీసుకో! నీ జీతం రాగానే ఇచ్చేయ్" అంటూ బహు వింత ఆర్డర్ పాస్ చేశాడు ఆమె భర్త.

మనసు చంపుకుని మనోహరరావును డబ్బులడిగేది. తన ఆఫీసులో పన్చేసే అటెండరు సింహాద్రి వాళ్లింటికి దగ్గర్లోనే వుంటాడు. అతని వద్ద తన భర్త వేలకు వేలు అప్పులు చేస్తుంటే వడ్డీలు కట్టలేకా, అసలు తీర్చలేకా నానాయాతనా పడేది బృహతి.

నాటకాల పిచ్చి వుండేది బృహతి భర్తకు. అందులో ఆడవాళ్ల కరుణాకటాక్షం కోసం జీతం డబ్బులూ, బృహతితో అప్పులు చేయించి తెచ్చిన డబ్బులూ వెదజల్లేవాడు. వీడి ఆడపిచ్చి గమనించి వాళ్లు మరీ గుంజేవారు తమ హొయ

లతో అతన్ని కవ్విస్తూ. ఆడగాలి తగిలితే చాలత నికి. ఇంకే ఇతర కార్యక్రమాలూ అక్కరలేదు. తలెత్తి తమ ఇరుగుపొరుగు ఆడవాళ్లను చూడడు గానీ, దొంగచూపులు చూసి తృప్తిపడతాడు.

“ఒసేవ్ చచ్చిందానా. రేపిపాటికి నాకు ఐదువేలు కావాలి. తెచ్చియ్యి. లేకపోతే ఇంట్లో వస్తువులూ, ఇల్లూ తగలబెట్టి పారేయగలను” అంటూ ఆర్డర్ వేశాడు ఓ రోజు.

ఇలాంటి వేలెన్నో ఇచ్చింది బృహతి. ఆఫీసు లోనూ, తన పుట్టింటివారి ద్వారానూ అతనడిగి నప్పుడల్లా అప్పులు తెచ్చి యిస్తుండేది అతనికి భయపడి. పెద్ద మొత్తాల్లో వడ్డీలు కట్టలేక, చిట్‌లు వేసేది. ఆ చిట్‌లు కట్టలేక మళ్లీ అప్పులు తేవడం- ఇలా కుడితిలో ఎలుకలా సతమతమవుతున్న ఆమెను “నీ జీతమంతా ఏం చేస్తున్నావే మిడిసిపాటు లంజా...” అంటూ వికృతంగా తిడుతూ లెక్కలడిగేవాడు అతను, మగవాడినన్న దురహంకారంతో. తల్లీ, తండ్రీ చిన్నతనంలోనే గతించారతనికి. అతను పెరిగిన వాతావరణం సరిగా లేక మొండిగా, క్రూరంగా తయారయ్యాడతను.

అప్పులిచ్చేవాళ్లకూ ఆమె పట్ల జాలి లేదు.

**ఇది నిజం**

**మన మిప్పుడు ఉదయాన్నే పళ్ళు తోముకునే బ్రష్షు 1780 లో విలియమ్స్ అడస్ అనే చర్మ వ్యాపారి కనుగొన్నాడు.**

వాళ్లకు కావాల్సింది వడ్డీ. ఆ అప్పులు చేయించ టానికి కారకుడైన బృహతి భర్తంటేనే వాళ్లకు అభిమానం.

“ఎప్పుడూ డబ్బులు తెమ్మని మొగుణ్ణి వేధించుకు తింటుంది కాబోలు. భరించలేక తిడుతుంటాడు ఆ మహానుభావుడు” అని ప్రక్క ప్రక్క ఇళ్లవాళ్లు తన గురించి అనుకో వడం విన్నది బృహతి.

ఎవరికీ నిజం చెప్పినా నమ్మరని తనలో తనే కుళ్లిపోతుంటుంది ఆమె.

“ఏంటి ఆలోచన. ఐదువేల సంగతి ఆలో చించు” అని కర్కశంగా అన్న భర్తను చూస్తూ--

“అవును. ఆలోచిస్తున్నాను. నీ కోసం అప్పులు చేసి అవి తీర్చలేక ఛస్తున్నానని, నా జీవితమంతా ఇలాగే గడిచిపోయేట్లున్నదని. అసలైన భరత నారిని కాబట్టి, సంస్కృత పండితుడు, సంస్కారవంతుడైన మా నాన్న పరువు కాపాడ్డం కోసం నిన్నొదిలిపోకుండా, నీ చేత అస్తమానం చావుతిట్లూ, బూతులూ తింటూ పడి వున్నాను. నీవు పెట్టే హింసలు భరిస్తూనూ. బయట అందరితో మంచివాడనిపించుకోవడం కోసం ఉచిత సేవలందిస్తున్నావు. నీ ఆడపిచ్చి కనిపెట్టే అందరూ నిన్ను తమ అవసరాలకు వాడుకుంటున్నారు. ఇంట్లో వంటలు కమ్మగా వున్నా ఏదో వంకలు పెట్టి తినకుండా, హోటళ్ల పైబడి మేస్తూ, అప్పులు కొండంతలుగా చేస్తున్న నిన్ను ఈ రోజుల్లో కూడా ఎవరు భరిస్తారురా... శుంఠ” పైకనలేని పాతివ్రత్యం అడ్డురాగా మనసులోనే తిట్టుకుంది బృహతి.

“ఏం నిన్న చెప్పింది గుర్తుందా! సాయం త్రానికల్లా ఐదువేలు కావాలి. ఎక్కడ తెస్తావో నీ ఇష్టం. ఎవడి దగ్గర పడుకుంటావో నీ ఇష్టం. నాకు మాత్రం డబ్బు కావాలి. లేకపోతే నా సంగతి తెలుసుగా... ఏం చేస్తానో...” అంటూ తలుపులు విసురుగా బాదుతూ, చెప్పులేసుకుని బయటకు నడిచాడు ఊరిమీద బలాదూర్‌గా తిరగడానికి... బయటివారి దృష్టిలో దేముడు.. బృహతి పాలిట కాలాంతకుడైన... త్రిపురాంతక శర్మ మాష్టారు


# ఫెమ్ నుంచి ఉచిత కానుక

## ప్రతి 90 గ్రా.ల ప్యాక్‌తో

## 2 ప్రత్యేకమైన బ్యాగ్ క్లిప్‌లు ఉచితం







త్వరపడండి! సరుకు ఉన్నంత వరకే ఈ అవకాశం!

Dazzal-Tel